క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 మధ్యాహ్నం 12 గంటల వరకూ హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు ఏరియా, రాజేష్ కాలనీ, స్పిన్నింగ్ మిల్లు–2 ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మర్యాదపూర్వకంగా..



ముద్దాల అనును సత్కరిస్తున్న జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా శాలువాతో ముద్దాల అనును సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రకాశం నగర్: విద్యార్థులు ఎప్పటి పాఠాలు అప్పుడే చదువుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ సూచించారు. స్థానిక విద్యానగర్‌లోని నాగరాజు కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి, వారి జవాబులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు టి.చక్రధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి సువార్త ర్యాలీ



బెలూన్లు ఎగరవేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: ప్రతి ఒక్కరూ సాటివారితో ప్రేమ, దయ, కరుణతో మెలగాలని వైఎస్సార్ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. క్రిస్టియన్ గాస్పెల్ మినిస్ట్రీస్ రెవరెండ్ జక్కల లాల్ బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన శాంతి సువార్త ర్యాలీని ఆయన ప్రారంభించారు. స్థానిక ఉమెన్స్ కాలేజీ జంక్షన్ వద్ద ర్యాలీ ప్రారంభమైంది. ముందుగా పావురాలను, బెలూన్లను డాక్టర్ శ్రీనివాస్ ఎగురవేశారు. కార్యక్రమంలో నక్కా శ్రీనగేష్, బళ్లా శ్రీనివాస్, గుడాల జాన్సన్, స్టాలిన్ రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక 45వ డివిజన్‌లో సుమారు రూ.60 లక్షల నగర పాలక సంస్థ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి కస్సే రాజేష్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మానే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల సైకిల్ ర్యాలీ

ప్రకాశం నగర్: 76వ ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 18వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ కాకినాడ ఆధ్వర్యంలో రాజమండ్రి సెక్టార్ పరిధిలో ఎన్‌సీసీ విద్యార్థులు సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌కే రామచంద్ర ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్, రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలు, పేపర్ మిల్లు, బీవీఎం పబ్లిక్ స్కూళ్లలోని 200 మంది క్యాడెట్లు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కోసం ఈ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారన్నారు. ఆర్ట్స్ కళాశాల నుంచి వై.జంక్షన్, కంబాల చెరువు, దేవీచౌక్, పేపర్ మిల్లు, రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాల, బ్రదరన్ చర్చి, బిజిలీ ఐస్ ఫ్యాక్టరీ, ఫుడ్ స్ట్రీట్ మీదుగా ఆర్ట్స్ కళాశాలకు ర్యాలీ చేరుకుంది. కార్యక్రమంలో మేజర్ రమేష్, లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా పాల్గొన్నారు.



పుష్కరాలరేవులో రావిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు



శివలింగాకారంలో వెలిగించిన దీపాలు



వెంకటనగరంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో దీపోత్సవం



గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు


హరహర మహాదేవ

- కిటకిటలాడిన గోదావరి రేవులు
- నదిలో దీపాలు వదిలిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సీటీఆర్ఐ: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా పుష్కరాల రేవు భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పావన గోదావరి జలాల్లో పుణ్యస్నానాలు చేసి, రేవు మెట్లపై, రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అరటి దొన్నెల్లో దీపాలను వెలిగించి గోదావరి జలాల్లోకి వదిలారు. ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, భువనేశ్వరీదేవికి కుంకుమార్చనలు చేశారు. శృంగేరీ శారదా శంకర మఠం ప్రధాన అర్చకుడు వెలవలపల్లి తాతయ్యశాస్త్రి.. చంద్రమౌళీశ్వరునికి పంచామృతాభిషేకాలు చేశారు. టి.నగర్‌లోని విశ్వేశ్వరస్వామి, సారంగధరేశ్వరస్వామి, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వైభవంగా లక్ష దీపోత్సవం

లక్ష దీపోత్సవంలో భాగస్వామిని కావడం పూర్వ జన్మ సుకృతమని రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ అన్నారు. సోమవారం రాత్రి కోటిలింగాల ఘాట్‌లో దర్మాదాయ దేవదాయశాఖ, ఉమా కోటి లింగేశ్వర స్వామి దేవస్థానం, సీతారామస్వామి దేవస్థానం, పంతం సత్యనారాయణ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. లక్ష దీపాల కాంతులతో గోదావరి తీరం ప్రకాశించింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా ఏటా నిర్వహించే లక్ష దీపోత్స కార్యక్రమాన్ని వీక్షించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.



కోటిలింగాలరేవులో గోదావరికి హారతి ఇస్తున్న నగర ప్రముఖులు



కోటిలింగాల ఘాట్‌లో దీపం వెలిగిస్తున్న మహిళ

సహస్ర దీపోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: వెంకట నగరం గ్రామంలోని అన్నపూర్ణా సహిత కాశీ విశ్వనాథస్వామి దేవాలయంలో శ్రీనివాస సుబ్రహ్మణ్య గోసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శోభకృత్ కార్తిక పూర్ణిమ సంధ్యా సహస్రదీపోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయం వద్ద గోదావరీ స్నానఘట్టంలో స్వదేశీ గోమయ ప్రమిదలలో దీపాలు వెలిగించి నదిలో మహిళలు విడిచిపెట్టారు. కొంపెల్ల శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించితే కఠిన చర్యలే



మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు సూచనలు చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్



సంగీత నీరాజనంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

- ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు
- ఆటోడ్రైవర్లపై ఎంపీ భరత్ ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ/ రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోల కండీషన్‌ను మోటార్ వెహికల్స్ కార్యాలయ అధికార్లు, సిబ్బంది ఎప్పటికప్పుడు పరీక్షించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. సోమవారం వీఎల్ పురం ఆల్ బ్యాంకు కాలనీ మీదుగా హైవే వైపుగా వెళుతున్న ఆయనకు విద్యార్థులతో నిండుగా వెళుతున్న ఆటోలు కనిపించాయి. వెంటనే ఆయన తన వాహనాన్ని ఆపారు. ఆటోలను నిలిచి, ఒక్కొక్క ఆటోలో ఇంతమంది విద్యార్థులా అని ఆశ్చర్యపోయారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడంతో ఆటో డ్రైవర్లపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వెంటనే మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)కు ఫోన్ చేశారు. ఆమె హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఒక్కో ఆటోలో 11, 12 మందికి పైగా విద్యార్థులను ఎక్కించుకుని తీసుకువెళ్లడాన్ని ఎంవీఐ సబితకు చూపించారు. ఇటీవల విశాఖపట్నంలో ఆటో ప్రమాదాలు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదనను వివరిస్తూ ఇంతమందిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కించుకోవడానికి వీల్లేదన్నారు. జరగకూడని ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ఎంపీ ప్రశ్నించారు. పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను తీసుకు వెళ్లాలన్నారు. నిబంధనలు అతిక్రమించే ఆటో డ్రైవర్లు, యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంవీఐ సబితకు సూచించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

సీటీఆర్ఐ: మన సంప్రదాయ కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం (ఇన్ క్రెడిబుల్ ఇండియా) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలకు రాజమహేంద్రవరం సాంస్కృతిక రాజధాని అన్నారు. మన రాష్ట్రంలో ఈ కార్యక్రమం ఆరు విశిష్టమైన ప్రాంతాలైన బొబ్బిలి, రాజమహేంద్రవరం, లేపాక్షి, మువ్వ, నెల్లూరు, కర్నూలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్ ఉంటుందన్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకున్ని ఈ కార్యక్రమంలో నగరంలో నిర్వహించడం మన అదృష్టం అన్నారు. అనంతరం కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమానికి కళాకారులను ఎంపీ సత్కరించారు. కార్యక్రమంలో టూరిజం ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, విజయ శంకర్ ప్రభుత్వం సంగీతం నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు కలిగి ఉండాలి



డీమార్ట్‌లో కియోస్కోను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

- కలెక్టర్ మాధవీలత
- ఉత్సాహంగా స్వీప్ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్: అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం స్వీప్ కార్యక్రమం కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కియోస్కోను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఉన్నత పాఠశాల, జిల్లా గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కలెక్టరేట్ ఆవరణ నుంచి జాతీయ రహదారి వరకూ విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఉన్నతాధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ నుంచి హుకుంపేట డీ మార్ట్ వరకూ ఏర్పాటు చేసిన భారీ బైక్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ స్వయంగా బైక్ ర్యాలీలో పాల్గొని ఉద్యోగుల్లో స్ఫూర్తిని నింపారు. డీమార్ట్‌లో ఏర్పాటు చేసిన కియోస్కోను కలెక్టర్, జేసీ ప్రారంభించారు. రూరల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సరళ వందనం అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ మాధవీలత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లను చైతన్యం పరిచి, రానున్న ఎన్నికలలో తప్పకుండా ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పిద్దామన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. జేసీ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ మనల్ని పాలించే వ్యక్తులను మనమే ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాష్, పి.సువర్ణ, నియోజక వర్గ ఓటు నమోదు అధికారి ఎస్.సరళా వందనం, మండల స్పెషల్ ఆఫీసర్ కేఎస్ జ్యోతి, డీఈవో ఎస్.అబ్రహం, తహసీల్దార్లు పైడి చిన్నారావు, ఎం.సుజాత, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందుకుమార్, డిప్యూటీ తహసీల్దార్లు కృష్ణ సుధీర్, సాగర్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

వివాహానికి సీఎంకు ఆహ్వానం

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కుటుంబ సమేతంగా సోమవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసారు. వచ్చే నెల ఆరో తేదీన ఆయన ద్వితీయ కుమారుడి వివాహం హైదరాబాద్‌లో, 14న రాజమహేంద్రవరంలో జరిగే రిసెప్షన్‌కు హాజరుకావాల్సిందిగా కోరి సీఎంకు శుభలేఖ అందించారు. వేణుగోపాలరావు భార్య అంజలి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ వైస్ చైర్మన్ నిఖిల్‌కృష్ణ, దివ్య సీఎంను కలిసారు.



ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు

పేపరుమిల్లు ఉద్యోగి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: మద్యానికి బానిసైన పేపరుమిల్లు ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. కాతేరు మల్లయ్యపేట క్వార్టర్స్‌లో ఉంటున్న దాసరి వెంకట సాయికుమార్ బాబు (36) పేపరుమిల్లు ఉద్యోగి. ఈ ఏడాది మేలో ఆయనకు రాజీ అనే అమ్మాయితో వివాహమైంది. అయితే సాయికుమార్ బాబు మద్యానికి బానిస కావడంతో తరచూ భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. దీంతో రాజీ కోలమూరులో అత్తమామలు వద్ద ఉంటోంది. సాయికుమార్‌బాబు క్వార్టర్స్‌లో ఉంటూ ఉద్యోగానికి వెళుతుంటాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తలిద్దరూ వాట్సాప్ కాల్‌లో మాట్లాడుకుంటుండగా సాయికుమార్‌బాబు టవల్‌తో ఉరివేసుకుంటున్నానని రాజీకి చూపించాడు. మద్యం మత్తులో అలా అంటున్నాడని ఫోన్ పెట్టేసింది. సోమవారం ఉదయం రాజీ సాయి కుమార్ బాబుకు ఫోన్ చేసినప్పటికీ తీయలేదు. దీంతో అనుమానంతో బంధువులు వచ్చి చూడగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజీ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

సీటీఆర్ఐ: స్థానిక ఆర్యాపురంలోని రమా సత్యనారాయణస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ దుంగ మంగాలక్ష్మి సురేష్ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి సామూహిక వ్రతాలు వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రసిద్ధ ఆలయాల్లో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రెసిడెంట్ పోలు విజయలక్ష్మి, వార్డ్ ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర్ చౌదరి, కాలే చిన్ని, డైరెక్టర్లు బసరబోయిన విజయ శంకర్, చంటి, విస్సారపు కాశీ విశ్వనాథ్, సుంకర అంజిబాబు, రఘుపాత్రుని సాయిబాబా, బాబీ, రేగుళ్ల బాల శ్రీధర్ (నాని), వంకాయల సత్తిబాబు, దుంగ కుమార్ పాల్గొన్నారు.

కమతాల నుంచి ఆవులు మాయం

రాజానగరం: మండలంలో రైతు కమతాల నుంచి ఆవులు అకస్మాత్తుగా మాయమవుతున్నాయి. నోరులేని జీవాలను అక్రమంగా తరలించుకుపోయి, కబేళాలకు అమ్మేసే ముఠా సభ్యులే వీటిని అపహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళ పాలు తీసుకుని, మేత వేసి, మర్నాడు ఉదయం కమతాలకు వచ్చిన రైతులు ఆవులు కనిపించకపోవడంతో బెంబేలెత్తుతున్నారు. రెండు రోజుల క్రితం రాజానగరం సామిల్లుల వద్ద బి.శ్రీరాములు అనే వ్యక్తి కట్టేసిన మూడు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు వ్యాన్‌లో వచ్చిన తరలించుకుపోయారు. వ్యానుకు ఉన్న నంబరు ప్లేటుకు నంబరు కనిపించకుండా క్లాత్ కట్టేసినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఫరిజల్లిపేటకు చెందిన బత్తిన వీర వెంకట్రావుకు చెందిన ఒక ఆవు, చక్రద్వారబంధం పాల వ్యాపారి బుజ్జికి చెందిన ఒక ఆవు, కంచుపట్ల లక్ష్మణరావుకు చెందిన రెండు ఆవులు వారం రోజుల వ్యవధిలో రాత్రికి రాత్రి మాయమైపోయాయి.


అర్జీలకు సత్వర పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 15 అర్జీలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ అర్జీల విషయంలో అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



సంజయ్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బాలుడి అదృశ్యంపై సీతంపేట నాయుడు గారివీధికి చెందిన బండి వెంకట సత్యనారాయణ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వీధికి చెందిన 14 ఏళ్ల బండి సంజయ్ ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అల్లరి ఎక్కువ చేస్తున్నాడని ఆదివారం మధ్యాహ్నం అతడిని తల్లి మందలించింది. దీంతో సాయంత్రం ఐదు గంటల సమయంలో బయటకు వెళ్లిపోయాడు. కానీ తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్సై జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన మహాయాగం

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శివశక్తి పీఠం సమీపంలో నిర్వహిస్తున్న రాజశ్యామల మహాయాగం సోమవారంతో ముగిసింది. లోక కల్యాణార్థం ఈ యాగాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించారు.

దుళ్ల ఎర్రకాలనీ 'మురుగు' పాపం టీడీపీదే

కడియం: దుళ్ల ఎర్రకాలనీ వాసులకు తీరని వ్యథగా మారిన అండర్ గ్రౌండ్ మురుగునీటి వ్యవస్థ పాపం తెలుగుదేశం పార్టీదేనని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు అన్నారు. సోమవారం దుళ్ల సచివాలయం వద్ద సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, పాలకవర్గ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి టీడీపీ హయాంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న లోకేష్ పర్యవేక్షణలో రూ.4.95 కోట్లతో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పర్యవేక్షించాల్సిన ఈ పనులను, పంచాయతీరాజ్ శాఖ సిబ్బందితో మొదలు పెట్టించారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పవని అప్పటి దుళ్ల టీడీపీ సర్పంచ్‌గా ఉన్న గుర్రపు సత్యనారాయణ సంబంధిత ఉన్నతాధికారులకు మొరపెట్టుకునప్పటికీ పట్టించుకోకుండా పనులు జరిపించింది వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. అప్పుడు లోకేష్ కమీషన్ల కక్కుర్తి కారణంగా ఇప్పుడు దుళ్ల ఎర్రకాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కానీ ఈ అంశాలేవీ తనకు తెలియనట్టుగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌లు సీఎం వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిందన్నారు. రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆదేశాల మేరకు సంబంధిత పనులకు అంచనాలు రూపొందించడం పాటు, కాలనీ ప్రజల మురుగునీటి కష్టాలు తీర్చేందుకు తగు విధంగా చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ లోపు రాజకీయంగా ప్రయోజనం పొందాలన్న దురుద్దేశంతో టీడీపీ, జనసేన నాయకులు అక్కడకు వచ్చి హడావుడి చేస్తున్నారన్నారు. అప్పట్లో వైఎస్సార్ సీపీలోనే ఉన్న దుర్గేష్ కూడా ఈ అండర్‌గ్రౌండ్ వ్యవస్థపై విమర్శలు చేసిన విషయం కూడా మర్చిపోయి, పార్టీ మారగానే ఇప్పుడు వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎర్రకాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఈలి గోపాలం, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తాతపూడి బాబి, సన్నపు బ్రహ్మానందం, నామాల సుధాకర్, పిచ్చుక వెంకట్రావు, వట్టి శివ, కాలెపు చెల్లారావు, కోసూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న స్టాలిన్, గిరజాల బాబు తదితరులు

గ్రామాల్లో క్రీడా సంబరాలు

మధురపూడి: గ్రామీణ ప్రాంతంలోని యువతను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడం కోసం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకూ 50 రోజులు క్రీడా సంబరాలు జరుగుతాయన్నారు. ఆసక్తిల కల వారందరూ సంబంధిత సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.